

గాలికి ఏడేళ్ల జైలు




ఓఎంసీ ఖనిజ దోపిడీ నిర్ధారణ

తీర్పునిచ్చిన సీబీఐ ప్రత్యేక కోర్టు

అనంతపురం, మే 6(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఖనిజ దోపిడీ నిర్ధారణ అయింది. కేసులో తొలి ముగ్గురు ప్రధాన ముద్దాయిలు బీవీ శ్రీనివాస్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, అప్పటి మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ఏడో ముద్దాయి, గాలి జనార్దన్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు ఎం.అలీఖాన్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించింది. ఏ-4గా ఉన్న ఓఎంసీకి రూ.లక్ష జరిమానా విధించింది.

(సమగ్ర వివరాలు మెయిన్‌లో)



అనంతపురం, బళ్లారి జిల్లాల్లోని బళ్లారి రిజర్వుడ్ ఫారెస్టు ఏరియా, డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని ఇనుప గనులలో ఓఎంసీ అక్రమ తవ్వకాలకు పాల్పడినట్లు కేసు నమోదైంది. కేసు దర్యాప్తును 2009 డిసెంబరు 7న ఉమ్మడి ఏపీ ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది.

ఓబుళాపురం మైనింగ్ తవ్వకాలను 2001-2002 సంవత్సరంలో రూ.10 లక్షల పెట్టుబడితో ప్రారంభించిన గాలి జనార్దన్ రెడ్డి, ఆరేడేళ్లలోపే రూ.3 వేల కోట్లు ఆర్జించారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులో మైనింగ్ మాఫియాను గాలి జనార్దన్ రెడ్డి నడిపించారు. డి.హీరేహాళ్ మండలంలో ఆరు మైనింగ్‌లు ఉండగా.. అందులో ఐదు గనులు ఓఎంసీవే కావడం గమనార్హం.

అనంతపురం జిల్లా, కర్ణాటకలోని బళ్లారి జిల్లా హద్దుగా బళ్లారి రిజర్వుడ్ ఫారెస్టు ఏరియాలో ఇనుప గనులను గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ లీజుకు తీసుకుంది. లీజ్ పొందిన ప్రాంతంలో కాకుండా, అటవీ ప్రాంతంలోని నో-లీజ్ ల్యాండ్‌లో తవ్వకాలు జరిపింది. ఇతరుల గనుల్లోకి చొరబడి ఇనుప ఖనిజాన్ని లూటీ చేసింది. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల సరిహద్దులను ధ్వంసం చేసింది. నాణ్యమైన ఖనిజం కోసం అక్కడున్న సుంకులమ్మ గుడిని కూల్చేశారు. ఇన్ని అక్రమాలకు కారణమైన కంపెనీని కేసులో ఏ-4గా సీబీఐ చేర్చింది. మొత్తంగా రూ.884.13 కోట్ల ప్రజాధనం దోచుకున్నారని సీబీఐ తేల్చింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి

తక్షణ చర్యలు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్



ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై స్వీకరించే అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను ఆయన స్వయంగా నోట్ చేసుకోవడంతోపాటు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజల సమస్యలను సావధానంగా వినడంతోపాటు వాటి పరిష్కారానికి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివన్నారు. రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకువెళ్లడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆ దిశగానే ముందుకు వెళుతున్నామన్నారు.

లైలా.. ప్రియుడు జైలుకు..!

మరో ఇద్దరు నిందితులు కూడా..

అనంతపురం క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): నగరంలో 'ఒక లైలా' కోసం సోమవారం జరిగిన కిడ్నాప్ వ్యవహారంలో ఆ మహిళ సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తాడిపత్రికి చెందిన ఆ మహిళ అనంతపురం ఆరో రోడ్డుకు చెందిన మురళితో ప్రేమ వ్యవహారం నడిపింది. కొంతకాలం క్రితం తాడిపత్రిలోని క్రిష్ణాపురం నాలుగో రోడ్డుకు చెందిన తోళ్ల నరేష్‌తో ప్రేమాయణం నడిపింది. ఈ క్రమంలో మురళి తరచూ ఫోన్ చేయడం ఆమెకు నచ్చలేదు. రెండో ప్రియుడితో కలిసి మురళిని కిడ్నాప్ చేసి కొట్టాలని ప్రణాళిక సిద్ధం చేశారు. తన స్నేహితులైన తాడిపత్రి మండలం దిగువపల్లికి చెందిన ఎనుముల రామమోహన్, దూదేకుల మాబు పీరాను నరేష్ పిలిపించుకున్నాడు. వ్యూహం ప్రకారం ఆమెచేత మురళికి సోమవారం సాయంత్రం ఫోన్ చేయించారు. కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోకి అతను రాగానే కారులోకి బలవంతంగా ఎక్కించుకున్నారు. దీంతో మురళి కేకలు వేశాడు. బైపాస్‌లో ఉన్న ఓ హెడ్‌కానిస్టేబుల్ గమనించి, పోలీసులకు సమాచారం అందించాడు. క్లాక్ టవర్ వద్దకు కారురాగానే ట్రాఫిక్ పోలీసులు నిలిపేసి, మురళిని రక్షించారు. మురళి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. తోళ్ల నరేష్, అతని ప్రియురాలు, ఎనుముల రామమోహన్, దూదేకుల మాబు పీరాను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

తీగ లాగేదెలా..?

- జిల్లాకు 400 కిలోమీటర్ల విద్యుత్‌తీగ సరఫరా
- క్షేత్రస్థాయికి సరఫరా కాక అన్నదాతల గగ్గోలు
- స్టోర్‌లో డ్రా చేయకుండా అడ్డుకుంటున్న అధికారి
- రైతులకు సమాధానం చెప్పలేని కిందిస్థాయి సిబ్బంది



అనంతపురం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులకు కండక్టర్ (విద్యుత్ తీగ) సరఫరాలో జాప్యం జరుగుతోంది. గతంలో సరఫరా కాలేదంటూ గగ్గోలు పెట్టిన సంబంధిత అధికారులు నేడు కండక్టర్ సరఫరా అయిన మేరకు పంపిణీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఒక వేళ సరఫరా చేసినా అర కొరగా చేసి చేతులు దులుపుకుంటున్నారన్న వాదనలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. దీనికితోడు విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయం స్టోర్‌లో సరఫరా అయిన కండక్టర్ ఉన్నప్పటికీ దాన్ని డ్రా చేయనీకుండా శాఖలోని ఓ అధికారి అడ్డుపడుతున్నారన్న వాదనలున్నాయి. దీంతో కండక్టర్ కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

జిల్లాకు 400 కిలో మీటర్ల కండక్టర్ సరఫరా

గత నెలలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు 527.95కిలో మీటర్ల కండక్టర్ సరఫరా అయింది. ఇందులో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు 60:40లెక్కన కేటాయించారు. అంటే అనంతపురం జిల్లాకు 316.77కిలో మీటర్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 211.180కిలో మీటర్ల విద్యుత్ తీగ కేటాయించారు. అంతకు ముందు కూడా 100కిలోమీటర్ల కండక్టర్ అనంతపురం జిల్లాకు కేటాయించారు. దీంతో అనంతపురం జిల్లాకు మొత్తం 400కిలోమీటర్లకు పైగా విద్యుత్ తీగ గత రెండు నెలల నుంచి సరఫరా అయ్యింది. అయితే దీన్ని రైతులకు అందజేయడంలో జాప్యం జరుగుతోంది. గత నెలలో సరఫరా అయిన కండక్టర్‌లో సోమవారం వరకు వంద కిలో మీటర్లు మాత్రమే డ్రా చేసినట్లు తెలుస్తోంది. మిగిలినదంతా జిల్లా కేంద్రంలోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలోని స్టోర్‌లో మూలుగుతోంది.

రైతుల నిరీక్షణ..

జిల్లాలో వేల మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకుని వెళ్లి పొలాల్లో దించుకున్నారు. కండక్టర్ సరఫరా అయితే వాటిని వినియోగించుకునేందుకు వీలుంది. అయితే కండక్టర్ సరఫరా చేయడంలో జాప్యం నెలకొనడంతో పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. 2023 డిసెంబరు నుంచి కండక్టర్ కోసం ఎదురుచూస్తున్న రైతులు జిల్లాలో ఉన్నారు. వారికే వంద కిలో మీటర్లకు పైగా కండక్టర్ సరఫరా చేయాల్సి ఉన్నట్లు సంబంధిత అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం సరఫరా అయిన కండక్టర్ కాక మరో 1500కిలో మీటర్ల మేర కండక్టర్ జిల్లాకు సరఫరా కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాకు సరఫరా అయిన మేరకైనా రైతులకు అందిస్తే కొంత ఉపయోగకరంగా ఉంటుందన్న అభిప్రాయాలు రైతుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. జిల్లాకు కేటాయించిన ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరాలోను నిర్లక్ష్యం జరుగుతోంది. దీంతో జిల్లాకు కేటాయించిన వాటిలో 200ట్రాన్స్‌ఫార్మర్లు పక్క జిల్లాకు బదలాయించినట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది.

అడ్డుకుంటున్న ఓ అధికారి

జిల్లా విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న కండక్టర్‌ను క్షేత్రస్థాయికి సరఫరా చేయకుండా ఓ అధికారి అడ్డుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి పెద్ద మొత్తంలో ఆమ్యామ్యాలు వస్తేనే కండక్టర్ ఇస్తానని ఆ అధికారి కొంత మంది అధికారులతో అన్నట్లు ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనికితోడు ఫలానా ఏఈ ఇంత తింటున్నాడు..ఇంత తెచ్చి ఇవ్వమని చెప్పండి. అప్పుడు కండక్టర్ ఇస్తానంటూ ఆ అధికారి అంటున్నట్లు ఆయా వర్గాల్లో మాట్లాడుకుంటున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో రైతులకు సమాధానం చెప్పలేక కిందికిందిస్థాయి అధికారులు, సిబ్బంది అవస్థ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ సబ్ డివిజన్ పరిధిలోని రైతులు తమ సమస్యను మొరపెట్టుకునేందుకు ఓ ప్రజాప్రతినిధిని కలిసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే సీఎం పర్యటన నేపథ్యంలో ప్రజాప్రతినిధి బిజీ ఉంటారన్న నెపంతో తమ ప్రయత్నాలను విన్నవించుకున్నట్లు తెలిసింది.

సిఫార్సులకు పెద్దపీట

ఇప్పటి వరకు జిల్లాకు వచ్చిన కండక్టర్‌లో కొంత వరకు డ్రా చేశారు. డ్రా చేసినదానిలోను చాలా వరకు సిఫార్సులకే కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, ఇతరత్ర వారు చెప్పిన వారికి మాత్రమే కండక్టర్ అందించినట్లు తెలుస్తోంది. ఇటీవల 126కిలోమీటర్ల కండక్టర్ డ్రా చేస్తే అందులో వంద కిలోమీటర్లు సిఫార్సులకే కేటాయించారని తెలిసింది. ఇది తెలిసిన కొందరూ రైతులు సిఫార్సులకే ఇచ్చుకుంటూ పోతే తమ పరిస్థితి ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

అలాంటిది ఏమీలేదు



సీనియార్టీ మేరకు రైతులకు కండక్టర్ సరఫరా చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో అనుకుంటున్నట్లు శాఖలో జరగడం లేదు. 2023 నుంచి రైతులకు కండక్టర్ సరఫరా చేయాల్సి ఉంది. అయితే కొంత మంది ఏఈఈలు 2024లోని రైతులకు ఇచ్చినట్లు నా దృష్టికి వచ్చింది. ఈక్రమంలోనే కండక్టర్ సరఫరాలో కొంత ఆలస్యం అవుతోంది. - శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ అనంతపురం జిల్లా

సీఎం సభకు గ్రామస్థులకే

అనుమతి

- పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టండి
- అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం



అనంతపురం టౌన్, మే 6 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఛాయాపురం పర్యటనకు ఆ గ్రామస్థులకు మాత్రమే అనుమతి ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సీఎం పర్యటనపై మంగళవారం ఆయన వీడియో క్నారెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన సీఎం.. వజ్రకరూరు మండలం ఛాయాపురానికి వస్తున్నారన్నారు. సీఎం సభకు ఆ గ్రామస్థులతోపాటు జిల్లాలో ఒక్కో నియోజవర్గం నుంచి 10మంది ఆయకట్టుదారులకు మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. 3వేల మందికి మించరాదన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. హెలీప్యాడ్, కాన్వాయ్, సభాప్రాంగణం తదితరప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసు శాఖను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహర్, డీఆర్వో మలోల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిడుగులతో జాగ్రత్త: కలెక్టర్

అనంతపురం టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పిడుగుల పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ప్రకటనలో హెచ్చరించారు. ఉరుములు, మెరుపులతో వర్షాలు పడేటపుడు ఎట్టిపరిస్థితులల్లోనూ చెట్లు, టవర్లు, స్తంభాలు, పొలాలు, బహిరంగ ప్రదేశాలలో ఉండకూడదన్నారు. సురక్షితమైన భవనాలలో ఆశ్రయం పొందాలని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కలెక్టరు కోరారు.

పోలీసుల దూకుడు

కుంటిమద్ది కేసు దర్యాప్తు వేగవంతం

నిందితుల సంఖ్య వందకు పైగానే..?

ఇప్పటి వరకూ 10 మంది అరెస్టు

తోపుదుర్తి ప్రకాశ్, పైలెట్‌కు నోటీసులు

7





ఇప్పుడే కాదు..!

సీఎం పర్యటన తరువాతే తాడిపత్రికి పెద్దారెడ్డి

ఎస్పీని కలిసిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



మాట్లాడుతున్న పెద్దారెడ్డి

అనంతపురం క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన అనంతరమే తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. తనను కలిసిన పెద్దారెడ్డితో జిల్లా ఎస్పీ జగదీష్ ఇదే విషయం స్పష్టం చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసే బాధ్యత తమపైనా, అధికారులపైనా ఉందని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డితో కలిసి మంగవారం ఆయన జిల్లా ఎస్పీని ఆయన చాంబర్‌లో కలిశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. తాడిపత్రికి వెళ్లే విషయంపై జిల్లా ఎస్పీని కలిశామన్నారు. ఈనెల 9న సీఎం పర్యటన అనంతరం తాడిపత్రికి పంపుతామన్నారని తెలిపారు. ఎస్పీ మాటలను గౌరవించి, కోర్టు ఆదేశాల మేరకు చట్టపరిధిలోనే నడుచుకుంటామన్నారు. సీఎం పర్యటన ముగిశాక ఎస్పీని ఫోన్ ద్వారా లేదా నేరుగా కలిసి ఓ డేట్ తీసుకుని తాడిపత్రికి వెళ్లడానికి ప్రయత్నిస్తామన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగానే పోరాడుతున్నామన్నారు. తాడిపత్రికి వెళ్లడానికి పెద్దారెడ్డికి పోలీస్ అధికారులు కోర్టు ఆదేశాల మేరకు భద్రత కల్పించాలన్నారు. ఎస్పీకి కోర్టు ఉత్తర్వు కాపీలు అందజేశామని, ఐదు వాహనాలతో తాడిపత్రికి వెళ్లేలా, పోలీస్ సెక్యూరిటీతో వెళ్లేలా కోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు.

కొనసాగిన గ్రూప్-1 పరీక్షలు

అనంతపురంటౌన్, మే6 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్ పరీక్షలు నాలుగోరోజు మంగళవారం ప్రశాంతంగా సాగాయి. జిల్లాకేంద్రంలోని పీవీకేకే ఇంజనీరింగ్, శ్రీబాలాజీ పీజీ కళాశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగాయి. మొత్తం 594 మంది అభ్యర్థులకుగాను 381 మంది హాజరయ్యారు. 231 మంది గైర్హాజరైనట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. జేసీ మంగళవారం గ్రూప్-1 పరీక్షకేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, తిప్పేనాయక్ పాల్గొన్నారు.

అన్నదాతా సుఖీభవ అమలుకు కసరత్తు

- 20 వరకు వెబ్‌ల్యాండ్ డేటా పరిశీలనకు గడువు

అనంతపురం అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాలో వెబ్‌ల్యాండ్‌లోని రైతుల ఖాతాలను పరిశీలించి, తప్పులుంటే సరిచేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. అన్నదాతా సుఖీభవ పోర్టల్‌లో వెబ్‌ల్యాండ్‌లోని 4,63,350 ఖాతాలను పరిశీలించి, తప్పులను సరిచేసే బాధ్యతలను రైతు సేవాకేంద్రం సిబ్బందికి అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 2,89,116 మంది రైతులకు రైతు భరోసా సొమ్మును జమ చేస్తూ వచ్చారు. ఏడాదికి రూ.13,500 రెండు విడతల్లో, కేంద్రం మూడు విడతల్లో జమ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.7500, కేంద్రం వాటా రూ.6000 వేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రస్తుతం సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నదాతా సుఖీభవ కింద ఏడాదికి పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఖరీఫ్ నుంచి అన్నదాతా సుఖీభవ సొమ్మును జమ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే తొలి విడతలో వెబ్‌ల్యాండ్ డేటా పరిశీలన మొదలుపెట్టారు. ఈనెల 20వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని గడువు విధించారు. వెబ్‌ల్యాండ్ డేటా పరిశీలన తర్వాత అన్నదాతా సుఖీభవ పోర్టల్‌లో రేషన్ కార్డు, ఆధార్, సీఎఫ్ఎంఎస్, ఇన్‌కమ్‌ట్యాక్స్ వివరాలతో క్రోడీకరించి పథకానికి అర్హుల జాబితాను ప్రకటించనున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి పథకం అమలుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సన్నద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి విధి విధానాలను అధికారులు త్వరలో జారీ చేయనున్నారు.

తరతరాల సంప్రదాయం..
బండిశూల ఉత్సవం..
ఏడు కాండ్ల ఎద్దులతో రథోత్సవం
(6లో..)





ఎక్స్‌కవేటర్‌తో పైపులైన్ పనులు చేస్తున్న దృశ్యం

తీరనున్న దాహం..

రూ.11.56 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు

- 90 శాతం పూర్తి
- ఏడువేల కుటుంబాలకు ప్రయోజనం

విడపనకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు గ్రామాలకు చెందిన 7 వేల మంది దాహం తీర్చే తాగునీటి పైపులైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. మండలంలోని హావళిగి గ్రామంలోగల పంపుహౌస్ నుంచి ఆరు గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఆరు గ్రామాలకు తాగునీరు సరిగా అందక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి సమస్యపై అప్పటి ప్రజాప్రతినిధులను ఖాళీ బిందెలతో నిలదీశారు. అయినా పట్టించుకున్న పాపాన పోలేదు. పయ్యావుల కేశవ్ ఎన్నికల ప్రచారంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలో నీటి సమస్య పరిష్కారానికి రూ.11.56 కోట్ల నిధులు కేటాయించారు. వెంటనే పనులు ప్రారంభించారు. 90 శాతం మేర పూర్తయ్యాయి కూడా.

బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం వద్ద హగరి నదిలో బావి తవ్వి, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా మండలంలోని హావళిగి పంపుహౌస్‌కు నీరు సరఫరా చేస్తున్నారు. దాదాపు 10.5 కిలోమీటర్లు పైపులైన్ ఉంది. అక్కడి నుంచి మండలంలోని హావళిగి, కరకముక్కల, పాల్తూరు, గాజుల మల్లాపురం, చీకలగురికి, ఉండబండ గ్రామాల్లోని ఏడు వేల కుటుంబాలకు చెందిన

28వేల మందికి తీరనున్న కష్టాలు

28 వేల జనాభాకు నీరు సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా నీరు ఆయా గ్రామాల ప్రజలకు చాలట్లేదు. 24 గంటలూ మోటార్లు పెట్టి నీరు తోడినా వారినికోసారి సరఫరా మాత్రమే నీరు అందుతోంది. వేసవిలో ఆయాగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపారు. పైపులైన్ పనులకు రూ.11.56 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో బొల్లనగుడ్డం నుంచి మరో భారీ పైపులైన్ నిర్మాణం చేపట్టారు. తద్వారా హావళిగి పంపుహౌస్‌కు నీరు తీసుకొస్తారు. అక్కడి నుంచి గ్రామాలకు సరఫరా చేస్తారు. హావళిగి పంపుహౌస్ పాతది కావడంతో కొత్తది నిర్మించనున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ నీరు సరఫరా చేసేలా కొత్తగా పైపులైన్లు వేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. ఇంకో 600 మీటర్లు చేయాల్సి ఉంది. అవి కూడా పూర్తయితే ఆయా గ్రామాల్లో తాగునీటికి కొరత ఉండదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పాత పైపులు



పంపుహౌస్ వద్ద సిద్ధంగా ఉన్న పైపులు

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



బొమ్మనహాళ్ మండలం బొల్లనగుడ్డం నుంచి హావళిగి గ్రామం వరకూ 10.5 కిలోమీటర్ల దూరం పైపులైన్ పనులు పూర్తిచేశాం. ఇంకో 600 మీటర్లు పెండింగ్‌లో ఉంది. అదికూడా త్వరలోనే పూర్తిచేస్తాం. దీంతో ఆరు గ్రామాలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

-ముజామిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, విడపనకల్లు

ఏరియా ఆస్పత్రిలో





కాలంచెల్లిన పోవిడన్ అయోడిన్ ఆయింట్‌మెంట్ కాలంచెల్లిన ఆయింట్‌మెంట్ (వృత్తంలో ఎక్స్‌పైర్ తేదీ)

ఎక్స్‌పైర్డ్ మందులు..!

గుంతకల్లు వైద్యశాలలో రోగుల ఆరోగ్యంతో చెలగాటం



గుంతకల్లు ఏరియా ఆస్పత్రి

గుంతకల్లు, మే6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కాలంచెల్లిన మందులతో రోగుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. విషయం తెలియక ఆస్పత్రికి వచ్చే రోగులు వాటిని గుడ్డిగా తీసుకెళ్తున్నారు. ఆస్పత్రికి సరఫరా అయ్యే మందులు నెలలో కాలంచెల్లే పరిస్థితిలో ఉంటుండటంతో వాటిని వాడేలోపే గడువు తీరిపోతున్నాయి. ఆస్పత్రికి వైద్యులకు విషయం తెలిసినా నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. ఎక్స్‌పైరీ మందులను వాడేది లేదంటూ కట్లుకట్టే సిబ్బంది.. ఫార్మసీ స్టాకిస్టుకు తెగేసి చెబుతున్నా.. 'ఎక్స్‌టర్నల్ యూజ్ కదా.. ఏమీకాదులే' అంటూ సర్దిచెబుతున్నారట. మందుల ఎక్స్‌పైరీ వివరాలను తెలిపి వైద్యులకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సి ఉండగా, ఆ పని జరగడంలేదు. రోగులు తినాల్సిన మందులు కూడా రేపో.. మాపో ఎక్స్‌పైరీ అయ్యే స్థితిలోనే ఉంటుండటం గమనార్హం.

కాలంచెల్లి నాలుగు నెలలు..

గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి ఎక్స్‌పైరీ డేట్ దాడిన మందులు వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏయే మందులు కావాలో ఇండెంటు పెడితే అనంతపురంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఆ మేరకు నెల, రెండు నెలలకు సరిపడా పంపుతారు. అలా గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి వచ్చిన మందుల్లో కొన్ని ఆయింట్‌మెంట్లు కాలంచెల్లి నాలుగు నెలలౌతోంది. వాటిని ఇంకా వాడుతూనే ఉన్నారు. రోగులకు ఇచ్చిపంపుతున్నారు. పోవిడన్ అయోడైన్ అనే ఆయింట్‌మెంట్ 2023 జనవరిలో తయారై, 2024 డిసెంబరు ఎక్స్‌పైరీ తేదీ కలిగి ఉంది. ఆ ఆయింట్‌మెంట్ ఆస్పత్రికి వచ్చి మూడు నెలలు మాత్రమే అయ్యింది. దానిని రక్తగాయాలు, పుండ్ల కట్టుకు వినియోగిస్తారు. ఆస్పత్రిలో కట్టుకట్టే సిబ్బంది ఆయింట్‌మెంట్ ఎక్స్‌పైరీ తేదీ దాటిన సంగతిని గుర్తించి ఫార్మసీ స్టోర్ ఇన్‌చార్జి, వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. 'ఎక్స్‌ర్నల్ యూజ్ కనుక వాడండి, పర్వాలేదంటూ..' వాటినే ఇస్తున్నారు. అలాగే క్లోట్రిమాజోల్ ఆయింట్‌మెంట్‌పై 2023 సంవత్సరం తేదీని వేశారు. వైద్యులకు ఇచ్చే పలు మందులు మరో నెలలో కాలం చెల్లే స్థితిలో ఉండగా, మరికొన్ని ఎక్స్‌పైర్ తేదీని దాటాయి.

ఎందుకీ పరిస్థితి?

కాలం చెల్లడానికి కేవలం నెలా, రెండు నెలలు ఉండగా సెంట్రల్ స్టోర్ నుంచి గుంతకల్లుకు మందులు వచ్చాయని తెలుస్తోంది. వాటిని ఎక్స్‌పైరీలోపే వినియోగించాల్సిన బాధ్యత వైద్యులు, ఫార్మసీ స్టాకిస్టుపై ఉంటుంది. సాధారణంగా మందుల కాలం చెల్లే తేదీ దగ్గరపడుతున్న వాటి వివరాలను తెలుపుతూ వైద్యులకు ఫార్మసిస్టులు జాబితాను ఇవ్వాల్సి ఉంటుంది. గడువు పూర్తయ్యేలోగా వాటిని వినియోగించడమో, లేదంటే సెంట్రల్ స్టోర్‌కు వాపసు పంపడమో చెయాల్సి ఉంటుంది. కాగా గతంలో ఫార్మసీకి, స్టోర్‌కు రెగ్యులర్ ఉద్యోగులు ఉండేవారు. వారిస్థానంలో ఇప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులు నిర్వహిస్తున్నారు. ఎక్స్‌పైరీ మందుల విషయంగా గతంలో వైద్యులకు నోట్ వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకుండాపోయింది. ఫార్మసీలో నిర్లక్ష్యం కారణంగా మందులు మూలన పడుతున్నాయని ఆస్పత్రి సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఎక్స్‌పైరీకి దగ్గరలో మందులు వస్తున్నాయి



కొన్ని మందులు ఎక్స్‌పైరీకి అతి దగ్గరలో ఉండగా ఆస్పత్రికి వస్తున్నాయి. వాటిని సకాలంలో వినియోగించుకునేలా స్టాకిస్టు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు ఎక్స్‌పైరీకి దగ్గరలో ఉన్న మందుల వివరాలను వైద్యులకు ఇచ్చి వినియోగించేలా చూడాలి. నోటి ద్వారా తీసుకునే మందులేవీ ఎక్స్‌పైరీ కాలేదు. కాలం చెల్లితే రోగులకు ఇవ్వడం లేదు. ఆయింట్‌మెంట్ల విషయంగా తప్పక చర్యలు తీసుకుంటా. సెంట్రల్ స్టోర్‌కు నివేదిక పంపి, వేరే ఆయింట్‌మెంట్లను తెప్పిస్తాం.

-జయవర్ధన్ రెడ్డి, గుంతకల్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్



ఎక్స్‌పైర్ అయిన మందు డబ్బా

శరవేగంగా విస్తరణ పనులు

హంద్రీనీవా ఎస్‌ఈ రాజాస్వరూప్‌కుమార్



హంద్రీనీవా విస్తరణ పనులను జూన్ ఆఖరులోగా పూర్తి చేస్తామని ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించామని, శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. ఈ పనులను పరిశీలించేందుకు ఈ నెల 9న సీఎం చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆ వివరాలు..

ఇంటర్వ్యూ

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పనులు జరుగుతున్నాయి...?

ఎస్ఈ: హంద్రీనీవాలో ప్రస్తుతం కాలువ వెడల్పు, సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కుడివైపున మాత్రమే కాలవను వెడల్పు చేస్తూవస్తున్నాం.

ప్రశ్న: లైనింగ్ పట్ల రైతుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. భూగర్భ జలాలు పెరగవని అంటున్నారు..

ఎస్ఈ: లైనింగ్ పనులతో సమస్యలు వస్తాయనేది అపోహ మాత్రమే. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. సిమెంట్ కాంక్రీట్ లైనింగ్‌తో భూగర్భ జలాలు తగ్గిపోతాయనేది అపోహ మాత్రమే. లైనింగ్ వల్ల చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

ప్రశ్న: నిధులు ఎంత కేటాయించారు....?

ఎస్ఈ: కాలువ 144 కి.మీ. నుంచి 216వ కి.మీ. వరకు మొత్తం 72 కి.మీ. కాలువ వెడల్పునకు రూ.400 కోట్లు కేటాయించారు. 216 కి.మీ. నుంచి 200 కి.మీ. వరకు మొత్తం 184 కి.మీ. లైనింగ్ కోసం రూ.936 కోట్లు మంజూరు చేశారు.

ప్రశ్న: పనులను ఎలా చేపడుతున్నారు...?

ఎస్ఈ: కాలువ వెడల్పు పనులు ఫేజ్-1 కింద ఒక ప్యాకేజీగా విభజించారు. ఫేజ్-2 కింద 8 ప్యాకేజీలుగా విభజించారు. అన్ని పనులు చాలావేగంగా జరుగుతున్నాయి.

ప్రశ్న: కాలువ సామర్థ్యాన్ని ఎంత పెంచుతున్నారు..? పటిష్టత ఎలా ఉంటుంది..?

ఎస్ఈ: లైనింగ్, వెడల్పుతో కాలువ మరింత పటిష్టం అవుతుంది. ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చే సామర్థ్యం ఉంది. పనులు పూర్తి అయితే 3,850 క్యూసెక్కుల నీటిని మల్యాల నుంచి తీసుకురావచ్చు.

ప్రశ్న: పనులను ఎప్పటికి పూర్తి చేస్తారు...?

ఎస్ఈ: పనులు ప్రారంభించిన నాటి నుంచి వంద రోజుల్లో పూర్తి చేయాలన్నది లక్ష్యం. 20 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కాలువ వెడల్పు, లైనింగ్ పనులను నిర్దేశించిన తేదీలోగా పూర్తి చేస్తాం. వచ్చే సీజన్‌లో మల్యాల వద్ద నుంచి కృష్ణా జలాలను తీసుకువస్తాం.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్

9న ఛాయపురం రానున్న

సీఎం చంద్రబాబు

చకచకా ఏర్పాట్లు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న జేసీ

ఉరవకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9న వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. హెలీప్యాడ్ పనులు, గ్రామసభ వేదిక ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. హెలీప్యాడ్ పనులను ఆర్ అండ్‌బీ ఎస్ఈ నాగరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం గ్రామం వద్ద హెలీప్యాడ్, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు గ్రామసభ వద్ద ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జగదీష్‌తో కలిసి జేసీ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలీప్యాడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డీవో, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలను ఆదేశించారు. హంద్రీనీవా బ్రిడ్జి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఈఈకి సూచించారు. గ్రామసభ ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకోవాలని గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కేశవనాయుడు, శ్రీనివాస్, డీపీవో నాగరాజు నాయుడు, జడ్పీసీఈవో రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజ్‌గోపాల్, డీఎల్‌డీవోలు లలితాబాయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తరతరాల సంప్రదాయం..

బండిశూల ఉత్సవం..

ఏడు కాండ్ల ఎద్దులతో రథోత్సవం

నేటి నుంచి ఐదు రోజులపాటు సంబరం

పామిడి, మే 6(ఆంధ్రజ్యోతి): బండిశూల (శూర బండి) ఉత్సవానికి జిల్లాలో ఎంతో ప్రత్యేకత ఉంది. మూడు గ్రామాలు కేంద్రంగా ఏడు కాండ్ల ఎద్దులతో ఐదు రోజులపాటు సాగే వైభోగమిది. స్వయానా దేవతలే చేయించుకుంటున్న మహోత్సవం. పామిడి మండలంలోని రామరాజుపల్లి, పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తి-అనంతపురం గ్రామాల నడుమ ఏటా వైశాఖ మాసంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. జిల్లాలోని పలు మండలాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతారు.





బండిశూల రథోత్సవం (ఫైల్), రామరాజుపల్లిలో సుంకులమ్మ, ముత్యాలయ్య స్వాములు

వేడుక వెనుక విశ్వాసం

ఐదు రోజులపాటు సాగే బండిశూల ఉత్సవాలపై రామరాజుపల్లి ప్రజలు చెప్పే చరిత్ర వింటే ఆశ్చర్యం కలగక మానదు. పూర్వం రామరాజుపల్లికి చెందిన రజకులు గుత్తి-అనంతపురం వాగుకు వెళ్లి దుస్తులు ఉతుకుతూ జీవనం సాగించేవారు. ఒకరోజు గ్రామానికి చెందిన ఓ రజకుడు వాగుకు దుస్తులు ఉతికేందుకు వెళ్లగా నీరు కనిపించలేదు. దీంతో వెనుదిరిగి వస్తుండగా రెండు గాడిదలపై ఇద్దరు చిన్నారులు కూర్చుని ఉండడం గమనించాడు. ఆ చిన్నారులను ఎంత పలకరించినా పలకలేదట. దీంతో ఆ రజకుడు.. వారి చేతులు పట్టుకోగా.. వారు అదృశ్యమయ్యారు. ఇలా ఈ తంతు వారం రోజులపాటు సాగింది. ఆ చిన్నారులు గ్రామంలోని చిన్నారులతో గోళీలాట ఆడుతూ అందరినీ ఓడించి ఆట పట్టించేవారు. ఈ విషయాన్ని ఆ రజకుడు, పిల్లలు.. గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామ ప్రజలు.. రజకుడి వెంట వెళ్లారు. గ్రామ ప్రజలకు కూడా గాడిదలపై వచ్చినట్లుగా బాలలు దర్శనమిచ్చారు. ప్రజలు వారిని నిలదీయడంతో తాము దేవతలమనీ, అక్కాతమ్ముడైన సుంకులమ్మ, ముత్యాలయ్య అని తెలిపారు. తమ పేరున వైశాఖ పౌర్ణమికి ఐదు రోజులు తిరునాల జరపాలని సూచించారట. ఆ గ్రామ దేవతలు ఏడు కాండ్ల (14ఎద్దుల)తో రథాన్ని లాగించాలని తెలిపారట. ఉత్సవానికి బండిలేదని ప్రజలు తెలపడంతో ఆ బాలరూప దేవతలు.. మద్దికెర గ్రామంలోని రజక గురప్ప ఇంటి వద్ద గల బండిని తీసుకురమ్మని ఆజ్ఞాపించారట. ప్రజలు.. గురప్ప ఇంటికి వెళ్లి బండి కావాలని కోరారట. గుర్రప్ప ఆ బండిని ఇవ్వడానికి తిరస్కరించి, దేవతలను తూలనాడడంతో వారు విషయాన్ని ఆ బాల దేవతలకు తెలియజేశారట. ఆ దేవతలు బండారు (కుంకుమ, పసుపుల మిశ్రమం).. గ్రామ ప్రజలకు ఇచ్చి పంపారట. బాల దేవతలు చెప్పినట్లు ఇవ్వని పక్షంలో 'నీ సంసారం కూలుతుందని తెలియజేసినా' గుర్రప్ప తిరస్కరించడంతో వెనుదిరిగారట. వారంరోజులు తిరక్కుండానే గుర్రప్ప, ఆయన భార్య, కుమారులు మరణించడంతో గుర్రప్ప తల్లి ఆ బండిని రామరాజుపల్లి ప్రజలకు అప్పగించిందట. మద్దికెర నుంచి తెచ్చిన బండిలో చింతలచెరువు గ్రామం హంపమ్మ ఇంటి నుంచి తాటిమానును తీసుకొచ్చి సుడిబండి తయారు చేశారు. సుడిబండికి ఉన్న తాటిమానుకు వేళాడితే ఎలాంటి రోగమైనా నయమవుతుందని భక్తులు విశ్వసిస్తారు. సుడిబండికి నేతిగారెలు, నిమ్మకాయలు, పుష్పహారాలు వేలాడదీస్తారు. ఆ గ్రామ దేవతలకు రామరాజుపల్లిలో ఇళ్లే ఆలయం. గుత్తి-అనంతపురంలో ఆలయం నిర్మించారు. స్వామివార్లను చిలకమ్మ పల్లకిలో ఊరేగిస్తూ వెళుతుంటే ఏడు కాండ్ల ఎద్దులు వంతులవారీగా బండిశూల(రథం)ను లాగుతాయి. ఈ రథం మూడు గ్రామాల పొలాల మీదుగా వెళ్తుంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా రథోత్సవాన్ని మాత్రం ఆపరు. ఏయే పొలంలో వెళితే అక్కడంతా పంటలు బాగా పండుతాయని రైతులు విశ్వసిస్తారు.

ఎద్దుల కొనుగోలు

చుట్టుపక్కల గ్రామాల రైతులు బండిశూల రథోత్సవం కోసం ఎద్దులను సైతం కొనుగోలు చేస్తారు. లక్షలాది రూపాయలు వెచ్చించి, ఎద్దులు కొని వాటికి ముస్తాబు చేసి రథం(బండిశూల) లాగిస్తారు. కొందరు రైతులు మొక్కుబడి అని తెలియజేస్తున్నారు. రథోత్సవంకు కొనుగోలు చేసిన ఎద్దులతో తమ పొలాల్లో వేసవి దుక్కులు చేసుకొని తిరిగి వాటిని విక్రయిస్తుంటారు. ఏడాదిపాటు రథోత్సవంలో తమ ఎద్దులు ఎలా లాగాయో ఇతరులకు చెప్పుకుంటూ మురిసిపోతుంటారు.

బందోబస్తు నడుమ బండిశూల ఉత్సవం

గట్టి పోలీసు బందోబస్తు నడుమ బండిశూల ఉత్సవాలు నిర్వహించనున్నారు. 2014 మే 9న 132 కేవీ విద్యుత్ తీగలకు రథం తాకడంతో ఏడుగురు మృతిచెందగా.. 20 మంది గాయపడ్డారు. గతేడాది ఎన్నికల నేపథ్యంలో ఉత్సవాలు జరుగలేదు. దీంతో ఈ ఏడాది మరింత ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో పోలీసుల పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఆ గ్రామాల్లో దేవుళ్ల పేర్లే..

రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి-అనంతపురం గ్రామాల్లో ప్రతి ఇంటిలోనూ సుంకులమ్మ, ముత్యాలయ్య పేర్లు కలిసేలా కుటుంబ సభ్యుల పేర్లు ఉండడం విశేషం. ప్రతి ఇంటిలోనూ స్వామివారి పేర్ల మీద ఇద్దరు, ముగ్గురు ఉంటారు. గ్రామాల్లో ఒకేపేరు గల వ్యక్తులు పదుల సంఖ్యలో ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వ్యక్తితోపాటు ఇంటిపేరు చెబితేనే చిరునామా తెలుస్తుంది.

నేటి నుంచి ఉత్సవాలు

ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకూ బండిశూల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రామరాజుపల్లి ప్రజలు పేర్కొన్నారు. మొదటిరోజు 7న స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గంగాభవాని పూజ, సుంకులమ్మ, ముత్యాలయ్య స్వామి వార్ల ఊరేగింపు, జలధి బావి వద్ద జలపూజ, నైవేద్య కార్యక్రమం చేపడతారు. అనంతరం స్వామివారిని హంసవాహనంపై ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొస్తారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక పూజానంతరం రథానికి ఏడు కాండ్ల ఎద్దులు కట్టి లాగిస్తారు. రామరాజుపల్లి నుంచి గుత్తి-అనంతపురం వనం(వాగు) వద్ద గల దేవాలయానికి రథోత్సవం వెళ్తుంది. 8న సాయంత్రం గుత్తి-అనంతపురం వనం వద్ద దేవాలయం నుంచి రామరాజుపల్లికి రథోత్సవం ప్రారంభిస్తారు. 9న రామరాజుపల్లి నుంచి మరోసారి గుత్తి-అనంతపురంలోని వనం వద్దగల గుడికి రథం చేరుతుంది. 10న గుత్తి-అనంతపురం వనం వద్ద తిరునాళ (పరుష) నిర్వహిస్తారు. సాయంత్రం బోణాలతో నైవేద్యం సమర్పించిన తర్వాత రథం రామరాజుపల్లికి బయలుదేరుతుంది. రాత్రికి రామరాజుపల్లికి చేరుకుంటుంది. ఏయే గ్రామ పొలిమేరల వరకూ ఆయా గ్రామాల ఎద్దులు రథాన్ని లాగుతాయి. 11న స్వామి వారికి మొక్కుబడులు తీర్చుకుంటారు.



గుత్తిఅనంతపురంలో స్వామి వార్ల ఆలయం

సజావుగా ఏపీ ఈసెట్

2,454 మంది విద్యార్థులు హాజరు



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 6(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాల కోసం ఏపీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్-2025) మంగళవారం సజావుగా ముగిసింది. ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో నిర్వహించిన పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షలకు 2,548 మంది విద్యార్థులకు గాను 2454మంది హాజరైనట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ తెలిపారు. పరీక్ష సమయానికి అరగంట ముందే విద్యార్థులు కేంద్రాల్లో వెళ్లిపోయారు. ఏపీఈసెట్ కమిటీ ఛైర్మన్, జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల, ఎస్ఆర్ఐటీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఏపీఈసెట్ నోటిఫికేషన్ విడుదల నుంచి పరీక్షల నిర్వహణ వరకు అధికారులు, సిబ్బంది సమయస్ఫూర్తితో పనిచేశారని, వారి సహాయ సహకారాలతో సజావుగా ముగిశాయని వీసీ పేర్కొన్నారు. 8న ప్రాథమిక కీ విడుదల చేసి 17న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేత ఫలితాలు విడుదల చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

గీతకులాల మద్యం షాపులకు రీ నోటిఫికేషన్

అనంతపురం అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 4 గీత కులాల మద్యం షాపులకు మంగళవారం అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి రీ నోటిఫికేషన్ జారీ చేశారు. డి. హిరేహాళ్ మద్యం షాపునకు గౌండ్ల, రాయదుర్గం రూరల్ గౌడ, గుత్తి రూరల్‌కు గౌడ్, కంబదూరు మండలానికి ఈడిగ కులస్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్లలో ఎక్కడైనా ఈనెల 15వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 17వతేదీ అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా కులస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9న మామిడి ఫలసాయం వేలం

బుక్కరాయసముద్రం, మే6(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో ఈనెల 9వ తేదీన మామిడి ఫలసాయానికి వేలంపాట నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ క్రాంతిరాజ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జైలులో ఉన్న 3,500 మామిడి చెట్లకు వేలంపాట ఉంటుందన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రేపు వేరుశనగ చెక్క వేలంపాట

అనంతపురం జిల్లా జైలులో ఈనెల 8వతేదీన వేరుశనగ చెక్క వేలంపాట నిర్వహిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ షఫీవుర్ రహిమాన్ ప్రకటనలో తెలిపారు. జైలులో వేరుశనగ మిల్లులో ఉన్న 25 టన్నుల చెక్కను వేలం వేయనున్నట్లు ఆయన చెప్పారు.

బాలలుగా మళ్లీ బడిలో..!

42 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తమ టీచర్లతో పూర్వ విద్యార్థులు

కణేకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): బాలలుగా విడిపోయిన వారు వృద్ధాప్యానికి చేరువవుతున్న దశలో కలుసుకున్నారు. కుశల ప్రశ్నలతో, చిలిపి మాటలతో మళ్లీ బడిలో చిన్నారుల్లా సందడి చేశారు. 42 ఏళ్ల కిందట విడిపోయినవారు మళ్లీ కలుసుకోవడానికి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వేదికయ్యింది. 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఒక చోటికి చేరారు. ఈ బడిలో చదివిన పూర్వవిద్యార్థులు వివిధ హోదాల్లో ఉన్నారు. వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిస్తూ, గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఉపాధ్యాయుడు నాగరాజు, ఎంఈఓ లక్ష్మణ్ణ హాజరయ్యారు. పూలమాలలు వేసి బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, గోపాల్, పీరబాష, ఎర్రిస్వామి, వెంకటేశలు, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.24వేలు

అనంతపురం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24,560, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 674టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పోలీసుల దూకుడు

- కుంటిమద్ది కేసు దర్యాప్తు వేగవంతం
- నిందితుల సంఖ్య వందకుపైగానే..?
- ఇప్పటి వరకూ 10 మంది అరెస్టు
- తహసీల్దారు వద్ద 17 మంది బైండోవర్
- తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి వాట్సాప్‌లో నోటీసులు
- పైలెట్ అనిల్ కుమార్‌కు మూడో నోటీసు
- 12న వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచన

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద జగన్ పర్యటన సమయంలో చోటు చేసుకున్న ఘటనలపై పోలీసులు విచారణను వేగవంతం చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో వాట్సాప్ ద్వారా నోటీసులు పంపించామని పోలీసులు తెలిపారు. వ్యక్తిగతంగా నోటీసులు ఇచ్చేందుకు అనంతపురంలోని ఆయన నివాసానికి బుధవారం వెళతామని తెలిపారు. మరోవైపు ఆ రోజు హెలిక్యాప్టర్ నడిపిన పైలెట్ అనిల్ కుమార్‌కు మూడో నోటీసును జారీ చేశారు. మొదటి రెండు నోటీసులకు ఆయన స్పందించినా, విచారణకు హాజరు కాలేదు. తనకు వర్చువల్‌గా హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి పోలీసులు నిరాకరించారు. చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయానికి ఈ నెల 12న వ్యక్తిగతంగానే హాజరు కావాలని సూచించారు.

అరెస్టులు.. బైండోవర్లు..

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సమయంలో కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. బారికేడ్లను తోసేసి, పోలీసులను నెట్టుకుంటూ హెలిక్యాప్టర్‌ను చుట్టుముట్టడం, దీన్ని భద్రతా వైఫల్యమని ఆరోపించడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. హత్యకు గురైన మజ్జిగ లింగమయ్య స్వగ్రామం పాపిరెడ్డిపల్లిలో ఇరుకైన దారులు ఉన్నాయని, జగన్ పర్యటనకు జన సమీకరణ చేయొద్దని పోలీసులు హెచ్చరించినా వైసీపీ నాయకులు పెడచెవిన పెట్టారు. విండ్ షీల్డ్ దెబ్బతిందని జగన్‌ను తిరిగి తీసుకువెళ్లకుండానే హెలిక్యాప్టర్ వెళ్లిపోవడంపైనా విచారణ జరుపుతున్నారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్న పోలీసులు ఇప్పటికే రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సహా 71 మందిపై కేసులు నమోదు చేశారు. మరో 30 మందిని కూడా నిందితులుగా చేర్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గతనెల 10వ తేదీన నమోదైన ఈ కేసులో ఇప్పటికే పది మంది వైసీపీ నేతలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. మరో 17 మందిని బైండోవర్ చేశారు. కేసులో ఉన్న పలువురు నిందితులకు 41 నోటీసులు జారీ చేసి విచారణకు పిలిపిస్తున్నారు.



తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

స్టేషన్ వద్ద హడావుడి

- రామగిరి జడ్పీటీసీ నాగార్జున, వైసీపీ నాయకులు ఎనుముల ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, అంకిరెడ్డి జయచంద్రారెడ్డి, దేవభూషణరెడ్డి, హరిజన ముత్యాలన్న, గుండల నారపరెడ్డి మంగళవారం విచారణకు హాజరయ్యారు. రామగిరి సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీధర్ వారిని ఉదయం నుంచే సాయంత్రం వరకు విచారించారు. హెలీప్యాడ్ వద్ద ఆ రోజు మీరు ఉన్నారా, ఎవరైనా రెచ్చగొట్టడంతో అక్కడికి వెళ్లారా, ఏదైనా ఉద్దేశంతో తోపులాట జరిగిందా అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము వైసీపీలో ఉన్నామని, జగన్‌పై అభిమానంతో చూసేందుకు వెళ్లామని పలువురు పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.
- కేసు దర్యాప్తు నేపథ్యంలో రామగిరి సర్కిల్ కార్యాలయంలో హడావుడి కనిపిస్తోంది. నిందితుల అరెస్టు, నోటీసులు, బైండోవర్‌లు, విచారణలు.. ఇలా ఏదో ఒక ప్రక్రియ కొనసాగుతోంది. రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా 100 మందికిపైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు అయింది. మండలాల వారీగా చూస్తే, ఇప్పటివరకూ చెన్నేకొత్తపల్లిలో 16 మంది, రామగిరిలో 11 మంది, కనగానపల్లిలో 19మంది, రాప్తాడులో 3, అనంతపురం రూరల్ 9, ఆత్మకూరులో 16 మందిపై కేసులు నమోదైనట్లు బహిర్గతమైంది.



గతనెల 8న కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణుల హల్‌చల్

కేసులో ముఖ్య నాయకులు

రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు పలువురిని పోలీసులు నిందితులుగా చేర్చారు. చెన్నేకొత్తపల్లి మండలంలో జడ్పీటీసీ గోవిందరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి నిందితులుగా ఉన్నారు. కనగానపల్లి మండలంలో జడ్పీటీసీ మారుతీ, వైసీపీ మాజీ మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, రామగిరి మండలంలో జడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ మీనిగ నాగరాజు తదితరులు ఉన్నారు. రాప్తాడు మండలంలో ఎంపీపీ భర్త చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సాకే వెంకటేశ్, అనంతపురం రూరల్ మండలంలో పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకుడు పవన్ కుమార్ ఉన్నారు. ఆత్మకూరు మండలంలో వడ్డిపల్లి, మదిగుబ్బ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహులు నిందితులుగా ఉన్నారు.

నేరచరితులే..

హెలీప్యాడ్ ఘటన కేసులో ఉన్న పలువురు వైసీపీ నేతలపై గతంలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కొందరిపై రౌడీషీట్ కూడా ఉంది. చెన్నేకొత్తపల్లి జడ్పీటీసీ గోవిందరెడ్డిపై ఓ భూవివాదంలో 2019లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వైసీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రరెడ్డిపై రౌడీషీట్ ఉంది. కనగానపల్లి మండల మాజీ కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డిపై కూడా పలు కేసులు ఉన్నాయి. రాప్తాడు మండల కన్వీనర్ సాకే వెంకటేశ్‌పై 2019 సాధారణ ఎన్నికల సమయంలో దాడులకు పాల్పడినట్లు కేసు నమోదైంది.

నీళ్లకు నిధులు

- గుత్తి తాగునీటి ప్రాజెక్టుకు రూ.211.78 కోట్లు
- హామీ నిలుపుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే
- సెప్టేజ్ మేనేజ్‌మెంటు కింద ఉమ్మడి జిల్లాకు సొమ్ములు



గుత్తి పట్టణం

గుంతకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): గుత్తి పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు నిధులను సమకూరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వును వెలువరించింది. గుత్తి పట్టణంలో తాగునీటి సమస్యను ఏడాదిలో పరిష్కరిస్తానంటూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఆమేరకు మొదటి సంవత్సరంలోనే పాక్షికంగా సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారం దిశగా కృషిచేసి ప్రభుత్వం నుంచి నీటి పథకానికి నిధులను సాధించారు. త్వరలో టెండరు ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 70 శాతం బ్యాంకు రుణంగా ఇవ్వనుంది. గుత్తిలో తాగునీటి శాశ్వత పరిష్కారానికి ఆంధ్ర ప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (ఏపీయూడబ్ల్యూఎస్ అండ్ ఎస్ఎంఐపీ) పథకం కింద నిధులను కేటాయిస్తూ జీవోను విడుదల చేసింది.

తాగునీటికి రూ. 211.78 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం 25 పట్టణాలలో తాగునీటి సమస్య, రెండు పట్టణాల్లో మురుగునీటి నిర్వహణ (సెప్టేజ్ ట్రీట్మెంట్) పథకాలకు నిధులను కేటాయిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా గత నెల 24న ఉత్తర్వులను విడుదల చేసింది ఈ మేరకు రాష్ట్రంలోని 25 పట్టణాలలో తాగునీటి పథకాల నిర్మాణానికి రూ. 2,468.63 కోట్లు, సెప్టేజ్ మేనేజిమెంట్ కోసం రెండు పట్టణాలకు రూ. 56.28 కోట్లు కలిపి మొత్తం రూ. 2,524.91 కోట్ల నిధులను కేటాయించింది. ఇందులో గుత్తి పట్టణంలో నీటి ఎద్దడి పరిష్కారానికి రూ. 211.78 కోట్లను కేటాయించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని పెనుకొండకు రూ. 60.72 కోట్లు, మడకశిరకు రూ.72.83 కోట్లు, కళ్యాణదుర్గంకు రూ.151.70 కోట్లు, పుట్టపర్తికి రూ.115.70 కోట్లు, సెప్టేజ్ మేనేజ్‌మెంటు కింద మడకశిరకు రూ.28.90 కోట్ల నిధుల కేటాయించారు.

70 శాతం రుణం, 30 శాతం గ్రాంటు

రాష్ట్రంలో తాగునీరు, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో 70 శాతం (రూ. 3,487.67 కోట్లు) ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) సమకూర్చ నుండగా, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం (రూ. 1,494.39) కోట్ల గ్రాంటు ఇవ్వనుంది. ఈ లెక్కన గుత్తి పట్టణ తాగునీటి నివారణకు మంజూరు చేసిన రూ. 211.78 కోట్ల నిధుల్లో రూ. 148.19 కోట్లు బ్యాంకు రుణంగా, రూ. 63.51 కోట్లు రాష్ట్ర గ్రాంటుగా లభించనుంది. బ్యాంకు రుణ మొత్తాలను అర్బన్ లోకల్ బాడీ అయిన గుత్తి పురపాలక సంఘం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు, పురపాలక సంఘాలకు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖా మంత్రికి, ఆశాఖ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుంచి ఉత్తర్వును పంపారు. ఈ నెల 9న ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు నాయుడు గుత్తి తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నామంటూ ప్రకటించే అవకాశం ఉంది.

ఇచ్చిన మాట నిలుపుకుంటా: గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే



ఎన్నికల ముందు గుత్తి ప్రజల దుస్థితిని కళ్లారా చూశా. ఏది చేసినా.. చేయకున్నా మొదట గుత్తిలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని గట్టిగా నిర్ణయించుకున్నా. అందుకే పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియకున్నా, ఒక సంవత్సరంలోపే గుత్తి నీటి సమస్యను పరిష్కరిస్తానంటూ అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయినప్పటి నుంచీ ఒకే లక్ష్యంతో పనిచేశా. ఎలాగైనా మొదటి సంవత్సరంలోనే గుత్తి తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిర్ణయించుకున్నా. తొలి యత్నంగా బోర్లు, వాటర్ ట్యాంకులు, స్పాట్ డెలివరి ట్యాంకుల ద్వారా తాత్కాలిక ఉపశమనం కలిగించా. ముఖ్యమంత్రి కూడా ఈ విషయంగా ఎంతో సహకరించి నిధులను విడుదలచేశారు. ఆయనకు ధన్యవాదాలు.

రైతు ఆత్మహత్య

యల్లనూరు, మే6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్జాంపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య (51) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. కృష్ణయ్య నాలుగు ఎకరాల పొలంలో అరటి పంట సాగు చేశాడు. పంట పెట్టుబడి కోసం సుమారు రూ.10లక్షలకు పైగా అప్పు చేశాడు. గతనెలలో వీచిన గాలివానకు అరటిపంట దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈక్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరక తీవ్రంగా మనస్తాపం చెందాడు. సోమవారం రాత్రి ఇంటిలో నిద్రించడానికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇతడికి భార్య భవానీతోపాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికి వివాహాలు అయ్యాయి. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

శెట్టూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడిపల్లి గ్రామం వద్ద కనుకూరు నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు మంగళవారం అదుపు తప్పి బోల్తా పడింది. అయితే బస్సు రోడ్డుపక్కన పంట పొలాల్లో పడటంతో అందులో పదిమందికి పైగా ఉన్న ప్రయాణికులకు గాని డ్రైవర్‌కు గానీ ఎటువంటి గాయా లు కాలేదు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు.

యువకుడి ఆత్మహత్య

గుమ్మఘట్ట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామంలో ప్రకాష్(30) సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన తెలిపిన మేరకు కలగోడు గ్రామానికి చెందిన ప్రకాష్‌కు పూలకుంట గ్రామానికి చెందిన నాగేంద్రమ్మతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య నాగేంద్రమ్మ పుట్టినింటికి వెళ్లడంతో ప్రకాష్ కూడా సోమవారం సాయంత్రం వెళ్లాడు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ అర్ధరాత్రి సమయంలో బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాష్‌కు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడని బంధువులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యామద్దలలో వృద్ధుడు...

చెన్నేకొత్తపల్లి: కడుపు నొప్పి తాళలేక మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య(67) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వృద్ధుడు గడచిన ఆరు నెలలుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండేవాడన్నారు. కుటుంబసభ్యులు వైద్యచికిత్సలు చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో గతంలోనే ఓ సారి ఆత్మహత్యకు విఫలయత్నం చేశాడు. తిరిగి కడుపునొప్పి బాధ భరించలేక సోమవారం రాత్రి ఇంటిలో విషపు గుళికలు మింగాడు. అపరస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు గమనించి, అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రికి మృతి చెందాడు. మృతుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అదృశ్యమైన బాలుడి మృతి

బావిలో శవంగా తేలిన చిన్నారి



అఖిల్ (ఫైల్)

నంబులపూలకుంట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరవాండ్లపల్లికి చెందిన నారాయణ, చంద్రకళ దంపతుల కుమారుడు అఖిల్(7) మంగళవారం బావిలో శవమై తేలాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి ఆడుకోవడానికి వెళ్లిన బాలుడు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు సోమ, మంగళవారాల్లో గ్రామానికి సమీపంలోని బావులు, మండలంలోనీ సీసీ కెమెరాలను క్షుణంగా తనిఖీ చేశారు. గ్రామానికి సమీపంలోని ఎర్రగుంట బావి వద్ద మంగళవారం సాయంత్ర ం నీటిపై బాలుడిశవం తేలియాడుతుండగా బయటికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం పంపినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

గుత్తి, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దాసరి వీధిలో జరగనున్న ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. కాలనీకి చెందిన రమణ, లక్ష్మి దంపతుల కూమార్తెను అదే కాలనీకి చెందిన వెంకటప్రతాప్ అనే యువకుడికి ఇచ్చి ఈనెల 8న స్థానిక కాలువ గడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలో వివాహం జరిపేలా నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కాలనీకి వెళ్లి ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు సమక్షంలో హాజరు పరిచారు. బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. మైనార్టీ తీరే వరకు వివాహం జరపరాదని సూచించారు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ సమితి సభ్యులు రమాదేవి, మహిళా పోలీస్ మంజుల, వీఆర్వో సురేంద్ర పాల్గొన్నారు.

ఐటీఐలో షార్ట్‌టర్మ్ కోర్సులు

అనంతపురం సెంట్రల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టూ వీలర్ సర్వీస్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు రెండునెలల శిక్షణ ఇస్తారన్నారు. ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వ సర్టిఫికెట్‌ను అందజేసి ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 12లోపు వారి బయోడేటాను కళాశాలలో అందజేయాలని కోరారు.

గుత్తిలో రైతు నుంచి నగదు అపహరణ

గుత్తి, మే 6(ఆంధ్రజ్యోతి): ఓ రైతు బ్యాంక్‌లో డ్రా చేసుకొని తన ద్విచక్రవాహనంలో ఉంచిన నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన గుత్తిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గుత్తి మండలం మాముదురు గ్రామానికి చెందిన మల్లికార్జున తమ వద్ద ఉన్న బంగారాన్ని సోమవారం గుత్తిలోని కెనరాబ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ. లక్ష రుణం తీసుకున్నాడు. ఆ నగదును బ్యాంక్ బయట ఉన్న ద్విచక్రవాహనంలోని బ్యాగ్‌లో ఉంచాడు. అనంతరం బ్యాంక్ సమీపంలో ఉన్న దుకాణం వద్దకు వెళ్లాడు. ఇదే అదనుగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పథకం ప్రకారం బైక్‌లో ఉన్న నగదును తీసుకుని ద్విచక్రవాహనంలో ఉడాయించారు. రైతు కేకలు వేసేలోపే వారు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా హనుమంతరావు ఆనంద్

అనంతపురం క్లాక్‌టవర్, మే 6(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా హనుమంతరావు ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అహుడా సెక్రటరీ బదిలీ

అనంతపురం క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): అహుడా సెక్రటరీ గౌరీశంకర్‌రావు బదిలీ అయ్యారు. మంగళవారం తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

న్యూస్ బాక్స్

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయండి



వీసీ ప్రొఫెసర్ అనితకు వినతిపత్రం ఇస్తున్న రామచంద్ర

అనంతపురం సెంట్రల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనితను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. అయితే నియామక ప్రక్రియ సాగుతున్న క్రమంలోనే కొందరు కోర్టుకెళ్లడంతో అర్ధాంతరంగా ఆగిపోయిందని తెలిపారు. ఇప్పటికైనా నూతన నోటిఫికేషన్ జారీచేసి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అలాగే ఆరు నెలల క్రితం నిర్వహించిన మెగా సప్లమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదలచేసి విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను మంజూరు చేయాలని కోరారు.

ప్రజల దాహార్తి తీర్చడం అందరి బాధ్యత



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈ నాగరాజు, ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్న సమయంలో ప్రజల దాహార్తిని తీర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జలవనరుల శాఖ సీఈ నాగరాజు, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ అన్నారు. మంగళవారం హెచ్చెల్సీ కాలనీలోని హంద్రీనీవా కార్యాలయ ఆవరణలో వారు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఉద్యోగులు, సందర్శకులు పనికోసం వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు అనువుగా చలివేంద్రం ప్రారంభించడం శుభపరిణామమన్నారు. జలవనరుల శాఖ డిప్యూటీ సీఈ రాజా, ఈఈలు మురళీ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ మల్లికార్జున, ఎన్‌టీపీపీ పార్థసారథి పాల్గొన్నారు.

ఆస్పత్రికి ఆర్వో ప్లాంటు వితరణ



ఆరో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బాలచంద్ర, టీడీపీ నాయకులు

శింగనమల మే 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ ఆస్పత్రికి రూ.5 లక్షలు విలువచేసే ఆర్వో ప్లాంట్‌ను అభయ ఫౌండేషన్ సంస్థ ప్రొప్రైటర్ బాలచంద్ర జిల్లా మెడకల్ డీపీహెచ్‌ఎస్ రవికుమార్‌కు అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచన మేరకు ఆర్వోప్లాంట్‌ను అందజేసినట్లు బాల చంద్ర తెలిపారు. ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ రోహినాథ్, ఈఓపీఆర్‌డీ, వెంకటలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, డేగల కృష్ణమూర్తి, మారుతి నాయుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదినారాయణ, మాసూల చంద్రమోహన్ పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

చెన్నేకొత్తపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. బియ్యం అక్రమంగా తరలుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని ప్యాదిండి వద్ద నిఘా వేసి బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 57 ప్యాకెట్లు బియ్యం ఉన్నాయి. వాటిని పరిశీలించగా సబ్సిడీ బియ్యమని తేలిందని, వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. సోమందేపల్లికి చెందిన మహేశ్, ధర్మవరానికి చెందిన లోకేశ్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నారన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రాప్తాడు: అక్రమంగా తరలిస్తున్న 40 కింటాళ్ల ప్రభుత్వ సబ్సిడీ బియ్యం వాహనాన్ని పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ జ్యోతి, సీఐ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం జాతీయరహదారిలో బియ్యం తరలిస్తుండగా మరూరు టోల్‌గేటు వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులు తనిఖీ చేసి బొలేరో వాహనాన్ని పట్టుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన రాంమోహన్‌రెడ్డి రెండో కుమారుడు భరత్ కుమార్‌రెడ్డి (31) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీఐ శ్రీహర్ష తెలిపిన మేరకు యర్రగుంటకు చెందిన భరత్‌కుమార్‌రెడ్డి వివాహం కాలేదని 1వ తేదీ గొందిరెడ్డిపల్లి సమీపంలోని ఎంఎస్‌ఎంఈ పార్కు వద్ద పురుగుల మందు తాగి నేను చనిపోతున్నానని స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి వెళ్లి అతనిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆజాద్ నగర్‌కు చెందిన ఈరన్న కుమారుడు చాకలి రా జేష్(20) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు మందలించినా అతనిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో మంగళవారం విషద్రావకం తాగాడు. కుటుంబసభ్యు లు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫేక్ ఐడీ సృష్టించిన వ్యక్తిపై విచారణ

అనంతపురం క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజాబలం న్యూస్ రిపోర్టర్ పేరుతో నకిలీ ఐడీకార్డు సృష్టించిన దేవరాజుపై విచారణ చేపట్టారు. 2వతేదీన డీపీఆర్వో గురుస్వామి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రజాబలం ప్రశ్నించేగళం న్యూస్ పేరుతో ఫేక్ ఐడీలో జిల్లా కలెక్టర్ సంతకం చేయించడం వివాదానికి దారి తీసింది. జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగినులను బెదిరింపులకు గురిచేసినట్లు కలెక్టర్ దృష్టికి వచ్చిందని తెలిపారు. చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్పీని కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సంబంధిత ఉద్యోగులు, అధికారులను విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

మత్స్యకారులు ఐకమత్యంగా అభివృద్ధి చెందాలి

రాప్తాడు, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని ఐకమత్యంగా అభివృద్ధి చెందాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ సూచించారు. మంగళవారం రాప్తాడు సమీపంలోని పండమేటి వెంకటరమణస్వామి ఆలయం వద్ద రాప్తాడు చెరువు సొసైటీ సభ్యులు అధ్యక్షుడు నగేష్, డీఎఫ్ఓ చంద్రశేఖర్, ఎఫ్‌డీఓ పక్కీరయ్య, వీఎఫ్‌ఏ కామాక్షిని సన్మానించారు.

నమ్మండి.. ఇది కాలువే..!

- అధ్వానంగా మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ
- వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం
- మరమ్మతులు కూడా చేయని దుస్థితి
- అడుగడుగునా గండ్లు
- పూడిక, కంపచెట్లతో నిండిన వైనం
- చివరి ఆయకట్టుకు సాగునీరు కలేనా..?



నిదనవాడ వద్ద గండ్లు పడిన మిడ్‌పెన్నార్ కాలువ

ఫొటో చూసి.. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది కాలువే. 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే మిడ్‌పెన్నార్ ఐదో దక్షణ కాలువ. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా స్వరూపమే మారిపోయింది. కాలువ నిర్వహణను గాలికొదిలేశారు. మరమ్మతులు కూడా చేయలేదు. వెరసి.. కాలువ గట్లు బలహీనపడ్డాయి. అడుగడుగునా గండ్లు పడ్డాయి. పూడిక, కంపచెట్లతో కాలువ నిండిపోయింది. నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. ఐదేళ్లలో 10వేల ఎకరాల ఆయకట్టుకు మించి నీరిచ్చిన పాపాన పోలేదు. చివరి ఆయకట్టు రైతు ఆశలపై నీళ్లు చల్లారు. కొత్త ప్రభుత్వం సాగునీటి సంఘాలను పునరుద్ధరించి, నిధులు మంజూరు చేస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువకు మరమ్మతులు చేసి, చివరి ఆయకట్టుకు నీరివ్వాలని కోరుతున్నారు.



మిడ్‌పెన్నార్ కాలువలో పెరిగిన చెట్లు

శింగనమల, మే6(ఆంధ్రజ్యోతి): మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువ గార్లదిన్నె మండలం ఎర్రగుంట్ల నుంచి 30 కిలోమీటర్లు ఉంది. శింగనమల మండలం సలకంచెరువు చెరువు వరకు కాలువ కింద 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువకు గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా మరమ్మతులు చేయలేదు. కాలువ గట్లు బలహీన పడి అక్కడక్కడా గండ్లు పడ్డాయి. దీనికితోడు కాలువలో పూడిక, కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరలేదు. గత పాలకులు.. కాలువ మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతోనే ఈ దుస్థితి దాపురించిందని తెలుస్తోంది. కాలువలో గండ్లు పూడ్చి, పూడిక, కంపచెట్లను తొలగించకపోతే చివరి ఆయకట్టుకు నీరు చేరడం సాధ్యంకాదని రైతులు పేర్కొంటున్నారు.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం



మిడ్ పెన్నార్ ఐదో దక్షిణ కాలువ కింద చివరి ఆయకట్టు భూములకు గత ఐదేళ్లలో చుక్క నీరు కూడా చేరలేదు. కాలువ పొడవునా కంపచెట్లు పెరిగాయి. గండ్లు కూడా ఉండడంతో నీరు పారలేదు. కొత్త ప్రభుత్వం కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. నిధులు రాగానే కాలువ పొడవునా గండ్లను పూడ్చి, కంపచెట్లను తొలగించే పనులు చేపడతాం. చివరి ఆయకట్టు వరకు నీరు పారేలా కృషి చేస్తాం.

- కుమ్మెత చంద్రాయుడు, నిదనవాడ కాలువ ఆయకట్టు అధ్యక్షుడు

రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపాం

- సురేంద్రరెడ్డి, ఇరిగేషన్ జేఈ

మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువ మరమ్మతుల కోసం రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే గండ్ల పూడ్చివేత, కంపచెట్ల తొలగింపు, పూడికతీత పనులు చేపడతాం.

కాలువ సామర్థ్యం పెంపునకు కృషి



ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే.. కాలువ మరమ్మతులు చేపడతాం. కాలువ వెడల్పు చేసి, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూస్తాం.

- ఓబుళరాజు, 19వ కాలువ ఆయకట్టు అధ్యక్షుడు, కల్లుమడి

వక్ఫ్ సవరణ బిల్లుపై ఆందోళన వద్దు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



కబరస్తాన్‌లో ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్/కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లింలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక అశోక్ నగర్‌లోని ముస్లింల ఖబరస్థాన్‌లో ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది రానివరన్నారు. మైనార్టీ నాయకులు షకీల్‌షఫి, మేయర్ వసీం, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, టీడీపీ నాయకులు ఫిరోజ్‌అహ్మద్, సరిపూటి రమణ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

అనంతపురం టౌన్: జిల్లాకేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసారు. ఆస్పత్రిలో తాగునీరు అందక రోగులు, ఆస్పత్రి సిబ్బంది పడ్డారు. సూపరింటెండెంట్, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్,ఆర్‌ఎంఓలు సీరియస్‌గా తీసుకుని సప్తగిరి క్యాంఫర్ సంస్థను ఆశ్రయించి ఆర్‌ఓప్లాంట్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఇందుకు సంస్థ అంగీకరించి రూ.6 లక్షలు నిధులు ఇచ్చి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. ప్లాంటును మంగళవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రారంభించారు. ప్లాంట్ ఏర్పాటు చేయించిన దాత సప్తగిరి క్యాంఫర్ ప్రతినిధి హనీఫ్‌ను ఘనంగా సత్కరించారు. ఆస్పత్రికి వీల్ చైర్స్ ఎయిర్ కూలర్లు, కుర్చీలు అందించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ బెనెడిక్టా, డిప్యూటీ ఆర్‌ఎంఓలు హేమలత, పద్మజ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు నరసింహులు పాల్గొన్నారు.

అక్కమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే

కూడేరు: మండలంలోని కరుట్లపల్లి వద్ద అక్క దేవతలను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ దర్శించుకున్నారు. అక్కదేవతల జాతర సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా సందర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు, గ్రామస్థులు స్వాగతం పలికారు. నాయకులు బోయపాటి శ్రీనివాసులు, సోమర జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

నీటి కుంటలు, బావుల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి



రాఘవేంద్ర కాలనీలో పిల్లలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం విద్య, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవల్లో బావులు, నీటి కుంటల వద్దకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికాకారులు సూచించారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా నగర శివారులోని రాఘవేంద్ర కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. సీడీపీఓ ఉమాశంకరమ్మ, డీసీపీయూ లీగల్ అండ్ ప్రొబేషన్ ఆఫీసర్ సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థులు ఎండల వేళ నీళ్లు ఎక్కువగా ఉన్న బావులు, కుంటల వద్దకు వెళ్లరాదన్నారు. సూపర్‌వైజర్ నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 3వ వార్డు సచివాలయంలో కిశోరీ వికాలం సమావేశం నిర్వహించారు. ఉమెన్ ప్రొటెక్షన్ దివ్యలక్ష్మి, అడ్మిన్ సెక్రటరీ రవి, లక్ష్మీనరసమ్మ, సత్యవతి, ప్రమీల పాల్గొన్నారు.

శింగనమల: కిశోర బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని జూలాకాలువ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలతో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమష్టి కృషితో బాల్యవివాహాలను అరికడదామన్నారు. మహిళా పోలీసు రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బాబయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, ఓబుళమ్మ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను కట్టడి చేయండి

అనంతపురం విద్య, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ముందస్తు అడ్మిషన్ల పేరుతో జరుగుతున్న దోపిడీ అరికట్టాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పలు సంఘాల నేతలు మంగళవారం వేర్వేరుగా నిరసనలు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్ వద్ద, ఏఐఎస్ఎస్‌బీ, ఎస్సీఎస్టీబీసీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకులు డీఈఓ ఆఫీస్ వద్ద ధర్నాలు చేశారు. అనంతరం సంఘాల నేతలు డీఈఓను కలసి ముందే అడ్మిషన్లు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీచైతన్య స్కూల్ వద్ద..: కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ, ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్ వద్ద ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు, ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, నరసింహయాదవ్, వెంకట్ నాయక్, చందు, మంజునాథ్, ఉమామహేష్, నాని, ప్రవీణ్, ఆశిష్ పాల్గొన్నారు.

డీఈఓ ఆఫీస్ దగ్గర..: జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో జరుగుతున్న ముందస్తు అడ్మిషన్లు ఆపాలని ఏఐఎస్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి పృథ్వి, ఎస్సీఎస్టీబీసీ, మైనార్టీ విద్యార్థి సమైఖ్య సురేష్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నాయకులు విజయ్, మధు, మనోహర్, వంశీ, మనోజ్ పాల్గొన్నారు.



శ్రీచైతన్య స్కూల్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

పేదలకు పురుడుపోసిన మాతృమూర్తి ఆర్డీటీ

● ఎఫ్‌సీఆర్ఏ కోసం కొనసాగుతున్న రిలేదీక్షలు

అనంతపురం సెంట్రల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ తమ ఆసుపత్రుల్లో 20 ఏళ్ల నుంచి లక్షల మంది పేద మహిళలకు ఉచితంగా పురుడుపోసిన మాతృమూర్తి అని పలువురు నాయకులు అన్నారు. ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణకు అనుమతి మంజూరుచేయాలని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. కమిటీ కన్వీనర్ సాకేహరి అధ్యక్షతన మంగళవారం రెండో రోజు రిలే దీక్షలకు సామాజిక కార్యకర్త అనిల్‌కుమార్, హైకోర్టు అడ్వకేట్ గంగన్న,



దీక్షలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

మాజీ కార్పొరేటర్ చవ్వా రాజశేఖర్ రెడ్డి, మాల మహానాడు ఓబులేసు సంఘీభావాన్ని తెలిపి నిరసన వ్యక్తంచేశారు. వారు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతే పరమావధిగా ఆర్డీటీని స్థాపించిన ఫాదర్ ఫెర్రర్ మూడు దశాబ్దాల క్రితమే అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆసుపత్రులను నిర్మించి ఉచిత వైద్యసేవ ప్రారంభించారన్నారు. ప్రజాసంఘాల నాయకులు రామకృష్ణ, సుగమంచి శ్రీనివాసులు, శ్రీరాములు, విజయభాస్కర్, వన్నూరప్ప, ఆదినారాయణ, కుళ్లాయప్ప, కృష్ణారెడ్డి, గోవర్ధన్, దేవి, రాజమ్మ, నిర్మల, శశికళ పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలి

అనంతపురం క్లాక్‌టవర్: వెనుకబడ్డ జిల్లాలోని పేదలకు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఆర్డీటీకి మానవత్వంతో ఎఫ్ఆర్‌సీఏ పునరుద్ధరించాలని జిల్లా పండ్లతోటల రైతులు కోరారు. మంగళవారం ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను కలిసిన జిల్లా పండ్లతోటల రైతుసంఘం నాయకులు తమ సంఘీభావం ప్రకటించారు. సంఘం ప్రతినిధి తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ వెనుకబడిన ప్రాంతంలో ఆర్డీటీని స్థాపించిన ఫాదర్‌ఫెర్రర్ పేదలకు విద్య, వైద్యం, గృహ వసతి కల్పించి ఆదుకున్నారన్నారు. రైతులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్, రాజ్‌కుమార్, నూర్ మహ్మద్, రఫీ పాల్గొన్నారు.



ఉత్సవాల ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

నసనకోట దుర్గమ్మ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

రామగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట సమీపంలో 14వతేదీ నుంచి జరగనున్న దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లలో ఎమ్మెల్యేపరిటాలసునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ నిమగ్నమయ్యారు. గ్రామపెద్దలు, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. 14 నుంచి 18వతేదీ వరకు ఘనంగాఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 50 ఏళ్ల తరువాత ఉత్సవాలు జరుగుతుండటంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురంరూరల్, మండలంలోని ఉప్పరపల్లిలో వెలసిన పాలవేరు వీరనాగమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం రామగిరి మండలం వెంకటాపురంలో ఉప్పరపల్లి గ్రామ పెద్దలు, టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 11, 12వ తేదీల్లో జరిగే ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విడుదల చేయించారు. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. నాయకులు జగదీష్, ముత్యాలు పాల్గొన్నారు.

తాడిపత్రి ఎమ్మెల్యేను కలిసిన కేశవరెడ్డి



ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో కేశవరెడ్డి, రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె, మే 6(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కృషి చేసి మంచి పేరుతీసుకుని రావాలని కేశవరెడ్డికి సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, కార్యదర్శి రాయల్ మురళి పాల్గొన్నారు.

అనాథ యువతి వివాహానికి ఆర్థికసాయం: మండలంలోని చెన్నంపల్లిలో అనాథ యువతి నూర్ ఏ చెష్మి వివాహానికి ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి రూ.20వేలు ఆర్థికసాయం చేశారు. గతంలో యువతి తల్లిదండ్రులు టీడీపీ కార్యకర్తలు కొనసాగుతుండేవారు. కొంతకాలం క్రితం అనారోగ్యంతో ఇద్దరూ మృతిచెందారు.

ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్‌కు సన్మానం



ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్‌ను సన్మానిస్తున్న తెలుగు యువత నాయకులు

అనంతపురం అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డిని తెలుగు యువత నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం అనంతపురంలోని ఆయన స్వగృహంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, నాయకులు తమ్మినేని వేణు కేశవరెడ్డికి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పరిటాల శ్రీరామ్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



నెట్టెం వెంకటేశ్‌ను సన్మానిస్తున్న పరిటాలశ్రీరామ్, నాయకులు

రామగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన నెట్టెం వెంకటేశ్ మంగళవారం వెంకటాపురంలో పరిటాల శ్రీరామ్‌ను కలిశారు. ఆయనను ఘనంగా సత్కరించి చైర్మన్ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ పార్టీలో ఎంతో సీనియర్ నాయకుడుగా ఉన్న నెట్టెం వెంకటేశ్‌కు తగిన గుర్తింపు పార్టీ ఇచ్చిందన్నారు. రామ్మూర్తినాయుడు, యాతం పోతలయ్య, ముకుందనాయుడు, జోగి అంజినప్ప, బిల్లేదాము, పతకమూరి అంజి, సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

నార్పల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పని కల్పించాలని సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నార్పల మండల కార్యదర్శి గంగాధర్, పెద్దపెద్దయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 17పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రమే పనులు జరుగుతున్నాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ లేని గ్రామాల్లో వెంటనే వానిఇ నియమించి పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని డిమాండ్ చేశారు. నాగరాజు, సుధాకర్, నారాయణప్ప, సూరి పాల్గొన్నారు.

సొసైటీ హమాలీలకే టెండర్ ఇవ్వాలి

అనంతపురంరూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్స్ లోడింగ్, అన్‌లోడింగ్ టెండర్ స్టోర్ సొసైటీ హమాలీలకే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్టోర్ హమాలీ కార్మికులకు ఆయనతోపాటు ముత్తుజ, నబిరసూల్, మారుతికుమార్, మధు, మహబూబ్‌బాషా మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలోని స్టోర్‌లో హమాలీలుగా 14 ఏళ్లుగా తక్కువ జీతాలతో పనులు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్టోర్ హమాలీలు సొసైటీలు ఏర్పాటు చేసుకుని వారికే టెండర్ల ద్వారా కార్మికుల సొసైటీలకు పనులు అప్పగిస్తున్నారన్నారు. 2024లో జిల్లాలో కొందరు బయట కాంట్రాక్టర్లు లోడింగ్ అన్‌లోడింగ్‌కు సంబంధించి ఎస్ఎస్ఆర్ రేట్ల కంటే లెస్‌కు టెండర్లు వేయడం వలన గతంలో వస్తున్న దానికంటే తక్కువ వేతనం తీసుకుంటున్నారన్నారు. దీంతో వీరి కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయన్నారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లు రావడం వలన కనీసవేతనం, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. అన్ని జిల్లాలో మాదిరిగానే స్టోర్ సొసైటీ హమాలీకే టెండర్ ఇవ్వాలన్నారు. యూనియన్ నాయకులు షామీర్ బాషా, గంగాధర్, హాజీ వలి పాల్గొన్నారు.



స్టోర్ హమాలీ సొసైటీ ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సంక్షిప్త వార్తలు

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎస్పీ


పూజల్లో పాల్గొన్న ఎస్పీ జగదీష్

ఉరవకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని ఎస్పీ జగదీష్ మంగళవారం దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బీసీలకు రుణాలివ్వాలి

గుంతకల్లు టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ల ద్వారా బీసీలకు వెంటనే రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి. లింగమయ్య డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య మండల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గుంతకల్లు మండలం చేతి వృత్తిదారుల సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రామురాయల్, అధ్యక్షుడిగా కె. గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.గురుస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆదినారాయణ మూర్తి, ఉపాధ్యక్షులుగా సుధాకర్, గోపాల్, రామాంజనేయులు, ఈరన్న, సహాయ కార్యదర్శులుగా సంగమేష్, సురేంద్రతో పాటు 21మంది సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు రాము, రామాంజనేయులు పాల్గొన్నారు.

కిశోరి వికాసం పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కథలగేరి, స్వీపర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో కిశోరి వికాసం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పావతి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎంకు సమ్మె నోటీసు

గుంతకల్లుటౌన్,మే6(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే జాతీయ సమ్మెకు సంబంధించి మంగళవారం డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తకు రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మురళి, నాగరాజు, ఎస్‌కేఎం బాష, తిమ్మప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

కూడేరు : కార్మికుల హక్కుల కోసం ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లు సమస్యలపై డాక్టర్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కూడేరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం సింగంపల్లి తండాకు చెందిన అరుణమ్మ (49) అనే మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపి మేరకు... సింగంపల్లి తండాకు చెందిన అరుణమ్మ, భర్త ఆదినారాయణనాయక్ నాలుగు రోజుల క్రితం ద్విచక్రవాహనంలో వస్తుండగా కూడేరు సమీపంలో ద్విచక్రవాహనంలో నుంచి ప్రమాదవశాత్తూ కిందకి పడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కూడేరు, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. పేదలకు వైద్య సేవలను అందించేందుకు అవకాశం వచ్చిందని తెలిపారు.

బంగారం గొలుసు చోరీ

కళ్యాణదుర్గంరూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మౌనిక అనే ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. బెళుగుప్ప మండలం శీర్పి కొట్టాల నుంచి పావగడ తాలుకా పెద్దపల్లికి వెళ్లడానికి భర్త నవీన్‌తో కలిసి కళ్యాణదుర్గం వచ్చి కర్ణాటక బస్సు ఎక్కిన వెంటనే హ్యాండ్‌బ్యాగ్ చూసుకుంది. అప్పటికే నాలుగు తులాల మూడు గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురికావడంతో బోరున విలపించింది. 100కు డయల్ చేయడంతో సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు

బ్రహ్మసముద్రం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రతిపాదనలు పంపారని టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. వేపులపర్తిలో మంగళవారం టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో మంత్రిగా ఉన్నవాళ్లు కూడా అధ్వాన్నంగా ఉన్న రోడ్ల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి వరకు 18 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఓబుళేసు, నాగరాజు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

బొమ్మనహాళ్, మే, 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం అయన విలేకరులతో మాట్లాడుతూ.. పరీక్షల్లో ఫెయిలయిన వారికి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే చేరుకోవాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లు టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ (చర్చి)హైస్కూల్‌లో 1991-2000 సంవత్సరాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని వివేకానంద పార్క్ నందు పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తరువాత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ప్రభాకర్, చంద్రకళ, ఆరోగ్యమేరీ, మాణిక్యమ్మ, లూర్దుమేరీ, ఇన్నయ్యను పూర్వ విద్యార్థులు సత్కరించారు.


ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు

- నిలిచిపోయిన భవనాల పనులు
- రూ.3.20 లక్షలు ప్రజాధనం వృథా


కూడేరులో గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు, నిలిచిపోయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

కూడేరు, మే 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు పథకం కింద మంజూరైన పనుల కోసం నిల్వ చేసిన సిమెంట్ బస్తాలు గడ్డకట్టాయి. దీంతో ప్రజాధనం వృథా అయింది. కూడేరు మండలంలోని వివిధ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వమే సరఫరా చేసింది. నిధులు విడుదల ఆలస్యం కావడంతో పనులు ముందుకు సాగక సిమెంట్ మొత్తం దెబ్బతినింది. మండల వ్యాప్తంగా 24 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఐదు అంగన్వాడీ కేంద్రాలకు నాడు- నేడు పనుల కింద నిధులు విడుదల చేశారు. భవనాల నిర్మాణానికి తక్కువ ధరకే ప్రభుత్వం సిమెంట్ సరఫరా చేసింది. 13,411 బస్తాల సిమెంట్‌ను సరఫరా చేయగా.. 12,144 బస్తాలను వినియోగించారు. వైసీపీ పాలనలో సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో వివిధ పాఠశాలల్లో 1252 బస్తాల సిమెంట్ నిల్వ ఉండడంతో ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నాయి. సిమెంట్ బస్తాలు ఆరు నెలల వరకు వినియోగించుకోవచ్చునని.. ఏడాదైన పనులు ప్రారంభం కాకపోవడంతో సిమెంట్ గడ్డలు కట్టిందని అధికారులు చెబుతున్నారు.

తక్కువ ధరకు ప్రభుత్వమే సరఫరా


వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు పథకం కింద మంజూరైన పనులకు ప్రభుత్వం ఒక్కొక్క సిమెంట్ బస్తా రూ.250 నుంచి రూ. 260 ధరతో సరఫరా చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాక ముందే సిమెంట్ సరఫరా చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు రూ. 3.20 లక్షల విలువ చేసే 1252 బస్తాల సిమెంట్ పూర్తిగా దెబ్బతినింది.

నిధులు రాగానే పనులు ప్రారంభం

భవనాల నిర్మాణానికి సరఫరా చేసిన సిమెంట్ దెబ్బతినిందన్న విషయం తెలిసింది. సకాలంలో పనులు జరగకపోవడంతోనే సిమెంట్ గడ్డలు కట్టింది. నిలిచిపోయిన భవనాల నిర్మాణానికి నిధులు తిరిగి రాగానే పనులు ప్రారంభిస్తాం. నిల్వ ఉన్న సిమెంట్ దెబ్బతింటే పనులకు వినియోగించడం సాధ్యం కాదు. దెబ్బతిన్న సిమెంట్ గురించి విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తారు. మాకు ఎటువంటి సమాచారం ఉండదు.

- రమణయ్య, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ

సచివాలయాలను పచ్చగా మారుద్దాం : జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, మే 6(ఆంధ్రజ్యోతి): సచివాలయాలు అద్భుతంగా ఉన్నాయని, వాటిని గ్రీనరీగా చేసి చూపిద్దాం అంటూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 92 సచివాలయాలు ఉన్నాయని తెలిపారు. వాటిలో 30 సచివాలయాలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయన్నారు. భవనాలు అద్భుతంగా ఉన్నాయని, మౌలిక వసతులు అరకొరగా ఉన్నాయని వీటిని మనం ఎందుకు గ్రీనరీ చేయకూడదని అన్నారు. వీటన్నింటిని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి గ్రీనరీగా చేయాలని ప్రత్యేక దృష్టి పెట్టాడన్నారు. మున్సిపాలిటీ గత ఐదు సంవత్సరాలుగా భ్రష్టుపట్టిందని వాటిని చక్కదిద్దాలంటే దాదాపు సంవత్సరం గడువు పట్టిందన్నారు. అండర్‌డ్రైనేజీ, ఎలక్ట్రికల్, వాటర్ వంటి సమస్యలు 40రోజుల్లో పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. చెత్త, డ్రైనేజీ, వాటర్ సమస్య లేకుండా చేసేందుకు ప్రైవేటుకు అప్పగిస్తామన్నారు. ప్రత్యేకంగా వార్డుకు నలుగురు వ్యక్తులను ఎంపికచేసి వారి జీతభత్యాలు తామే భరిస్తామన్నారు.

మన పట్టణాన్ని మనమే తీర్చిదిద్దుకుందాం

మన పట్టణాన్ని మనమే చక్కదిద్దుకోవాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీబీరోడ్డులోని దుకాణాల వద్ద మాట్లాడారు. బస్టాండ్ వద్ద నుంచి సీబీరోడ్డు మీదుగా పోలీస్‌స్టేషన్ సర్కిల్ వరకు అందరిని పలకరిస్తూ షాపు నిర్వాహకులతో మాట్లాడుతూ వచ్చారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని, ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలపరాదన్నారు. మండలంలోని వంగనూరు గ్రామానికి చెందిన శివారెడ్డి మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

అక్కమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

కూడేరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరుట్లపల్లి వద్ద అక్కమ్మ దేవతలను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ దర్శించుకున్నారు. అక్కమ్మల జాతర సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా సందర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు, గ్రామస్థులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి అక్కమ్మ దేవతలను కొలుస్తున్నానని, అమ్మవారి దీవెనలతోనే ఎమ్మెల్యేగా గెలిచానని, జాతరలో పాల్గొడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

మారెమ్మ, పెద్దమ్మకు బోనాలు


అలంకరణలో మారెమ్మ, పెద్దమ్మ దేవతలు

కూడేరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమ్మూరు గ్రామంలో గ్రామ దేవతలు మారెమ్మ, పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. మంగళవారం తెల్లవారిజామున గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాలతో తరలివెళ్లారు. మూడో రోజు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారికి వేడుకున్నారు.

రైతులకు అండగా టీడీపీ ధర్నా

బ్రహ్మసముద్రం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపులపర్తి యూనియన్ బ్యాంకు రైతుల సమస్యల పరిష్కారానికి టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బ్యాంకు అధికారులు వడ్డీమాత్రమే తీసుకుని రుణాలు రెన్యూవల్ చేసుకుంటామని హామీ ఇచ్చి తిరిగి అసలు వడ్డీ కట్టాల్సిందేనని బ్యాంకు మేనేజర్ రైతులను ఇబ్బందులకు గురిచేశారు. రుణాలు రెన్యూవల్ చేయడంలో బ్యాంకు వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులకు గుర్తించి రైతు సమస్యలను తెలుసుకున్న టీడీపీ నాయకులు మంగళవారం బ్యాంకు ముందు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కురుగౌడ, ఓబుళేసు, నాగరాజు, టీడీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి

యల్లనూరు, మే6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాయమంద గ్రామంలో రామాంజనేయులుపై అదే గ్రామానికి చెందిన రంగనాయకులు అతని కొడుకులు ఇనుపరాడ్‌తో దాడిచేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. రామాంజనేయులు మూడు సంవత్సరాలక్రితం రూ.50వేలు నగదును రంగనాయకులకు అప్పుగా ఇచ్చారు. ఈ డబ్బులు తనకు తిరిగి ఇవ్వాలని మంగళవారం రంగనాయకులు ఇంటివద్దకు వెళ్లి అడిగారు. ఈ విషయంలో రంగనాయకులు, అతని కొడుకులు రామాంజనేయులుపై దాడిచేయడంతో తలకు రక్తగాయాలయ్యాయి. రంగనాయకులు, అతని కొడుకులు ఇద్దరిపైన కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన మంత్రి సవిత


జిల్లా అధ్యక్షుడిని కలిసిన మంత్రి సవిత

గుత్తి, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ స్వగృహంలో మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి వెళుతూ మార్గమధ్యంలో గుత్తిలో వెంకటశివుడు ఇంటికి వచ్చి కలిశారు. పార్టీ అధినేత చేపడుతున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు ఆమె సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌నాయుడు, నరేంద్రచౌదరి, నాగరాజు, రసూల్, నిజాం, రాము పాల్గొన్నారు.

హంద్రీనీవా ఆయకట్టుకు నీరివ్వాలి: సీపీఐ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డి.జగదీశ్

గుంతకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ఆయకట్టుకు సాగునీరివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి అనంత జిల్లాలో హంద్రీనీవా, తుంగభద్ర కాల్వల కింద లక్ష ఎకరాలకు కూడా సాగునీరు లభించలేదన్నారు. హంద్రీనీవాలో నీరు పారుతున్నా, పిల్ల కాల్వలను పూర్తిచేయనందున ఆయకట్టు అభివృద్ధి జరగలేదన్నారు. పేరుకే కృష్ణాజలాలు జిల్లాకు వస్తున్నాయనీ, హక్కుదార్లుగా ఉన్న ఆయకట్టు రైతులకు నీరు చేరడంలేదన్నారు. 2017లో పామిడి సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాగులపాడు వల్ల నుంచి చెరువులకు నీరిచ్చే ప్రాజెక్టును ప్రకటించారన్నారు. 9న ఉరవకొండ పర్యటనలో ఆ పనులకు వెంటనే నిధుల ప్రకటన చేసి మాట నిలుపుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపి, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, రామాంజనేయులు పాల్గొన్నారు.

మల్బరీ రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

రాయదుర్గంరూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): మల్బరీ సాగులో రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కళ్యాణదుర్గం డివిజన్ సిరికల్చర్ డీఈ ఉషవర్ధిని పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీ కింద మల్బరీ సాగుచేసే రైతులకు నియోజకవర్గ పరిధిలో ఎనిమిది మల్బరీ షెడ్ల యూనిట్లను మంజూరు చేసిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా నిధులను ఉపయోగించేలా ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో ఫిరోజ్ బాషా, టీఏలు రమణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

బడుల ప్రారంభం రోజునే పుస్తకాలు పంపిణీ చేస్తాం

యాడికి, మే6(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది బడుల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తామని ఎంఈఓ-2 ధనలక్ష్మి తెలిపారు. యాడికి మండలానికి సంబంధించి ఇప్పటికే 11,621 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. పాఠ్యపుస్తకాలను యాడికి నెంబరు-1 పాఠశాలలో భద్రపరిచారు. ప్రభుత్వ పాఠశాలల వారిగా పంపిణీ నిమిత్తం మంగళవారం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలానికి సంబంధించి 90శాతంపైగా పాఠ్యపుస్తకాలు వచ్చాయని తెలిపారు. ఎమ్మార్సీ సిబ్బంది విశ్వనాథ్, రామకృష్ణ, ఓబులేసు, బాబు, శైలజ పాల్గొన్నారు.

గ్రాండ్ టెస్టులతో మరింత ప్రోత్సాహం : కాలవ


మాట్లాడుతున్న విప్ కాలవ

రాయదుర్గం, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో రాయదుర్గం ప్రాంత డీఎస్సీ అభ్యర్థులకు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు 11వ తేదీ నుంచి గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల మాట్లాడుతూ.. 400 నిరుద్యోగులకు 110 రోజుల పాటు 14 మంది నిష్ణాతులతో ఉచితంగా కోచింగ్ ఇప్పించామని తెలిపారు. 500 మందికి ఉచితంగా డీఎస్సీ మెటిరియల్‌ను పంపిణీ చేశామన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు 10 గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నామని అన్నారు.

11న క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలు

హైదరాబాద్‌కు చెందిన ప్రసిద్ధ ఇండో అమెరికన్ బసవతారకం ఆసుపత్రి ఆధ్వర్యంలో 11వ తేదీన ఉదయం 10 గంటలకు క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఆవరణంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలలని పిలుపునిచ్చారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

రాయదుర్గం రూరల్ : మండలంలోని వేపరాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రామన్న (48) ప్రమాదవశాత్తు ఎద్దులబండి పై నుంచి జారి పడి మంగళవారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న విప్ కాలవ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

పల్లె ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తా : ఎమ్మెల్యే


చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, మే6 (ఆంధ్రజ్యోతి): పల్లెప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి దిశగా పయనించేలా చర్యలు చేపడతానని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భీమునిపల్లిలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామంలో డ్రైనేజీ, తాగునీటి సమస్య నెలకొందని ఆయన దృష్టికి రాగా త్వరలోనే వాటిని పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను ఇస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ భారన్ సాబ్, జేఈ వరప్రసాద్, టీడీపీ నాయకులు కేశవరెడ్డి, వెంకటరామిరెడ్డి, చిరంజీవులు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్

తాడిపత్రి : పట్టణంలోని నివాసంలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని మంగళవారం ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి కలిశారు. అనంతరం ఆయనకు శాలువాకప్పి సన్మానించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ తదితరులు ఉన్నారు.

చెరువు మట్టి తరలింపునకు అనుమతి తప్పనిసరి

యాడికి, మే 6(ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి తరలింపునకు ఇరిగేషన్‌శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆ శాఖ డీఈ నాగేశ్వరశర్మ తెలిపారు. మంగళవారం మండలంలోని రాయలచెరువు గ్రామంలోని చెరువును ఆయన పరిశీలించారు. అనుమతి లేకుండా మట్టితరలింపుపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. చెరువుమట్టి అవసరమైన వారు తమకు దరఖాస్తు ఇవ్వాలనిని తెలిపారు.

సుంకులమ్మ దేవరకు హాజరైన ఎమ్మెల్యే సోదరులు

గుంతకల్లుటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాల గ్రామంలో మంగళవారం సుంకులమ్మ అవ్వ దేవరకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతినాయుడు, బండారు ఆనంద్, వెంకటేష్, మస్తానప్ప, ప్రతాప్ , చంద్ర, ప్రకాష్‌రెడ్డి, పాలమల్లికార్జున పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీలో అవినీతిపై ధర్నా

గుత్తి, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళలకు పంపిణీ చేస్తున్న కుట్టుమిషన్ల పేరట కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడిందని నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు లలితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్‌చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి పాల్గొన్నారు.

హుండీ సొమ్ము లెక్కింపు

ఉరవకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామికి సమర్పించిన హుండీ సొమ్ము, కానుకలను మంగళవారం లెక్కించారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి పర్యవేక్షణలో హుండీలను తెరచి లెక్కించారు. 48 రోజులకు గానూ రూ.10,96,642 హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో రమేష్‌బాబు తెలిపారు.

వైభవంగా వాసవీ మాత ఊరేగింపు

కణేకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో వాసవీమాత విగ్రహాన్ని మంగళవారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆర్య వైశ్యులు వెండి వాసవిమాత విగ్రహాన్ని చేయించారు. ఈ నేపథ్యంలో పూర్వ వీధుల్లో ఊరేగించినట్లు చెప్పారు.

ఆర్డీటీకి మద్దతుగా ర్యాలీలు

కళ్యాణదుర్గంరూరల్/గుత్తి, మే 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఆర్డీటీ ఓ వరమని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. మంగళవారం కళ్యాణదర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. గుత్తిఆర్ఎస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున స్థానిక మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు.

తాగునీటి కోసం గ్రామస్థుల ఆందోళన


కంబదూరులో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు, కుందుర్పిలో సచివాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కంబదూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అండేపల్లిలో కొన్ని నెలలుగా తాగునీటి కష్టాలతో గ్రామస్థులు నానా కష్టాలు పడుతున్నారు. నీటి కష్టాలు తీర్చాలంటూ మండల పరిషత్ కార్యాలయాన్ని మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం ముట్టడించారు. మధ్యాహ్నం 12 గంటలు వరకూ అధికారులు రాకపోవడంతో తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలంటూ ఆగ్రహంతో కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. కాసేపటికి కార్యాలయానికి వచ్చిన జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందచేశారు.

● కుందుర్పి: మండల పరిధిలోని తూముకుంట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మంగళవారం సీపీఐ నాయకులు, గ్రామస్థులు సచివాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా గ్రామంలోని శుద్ధి జల నీరు రాకపోవడంతో సచివాలయంలోని సిబ్బందిని బయటికి పంపి తాళం వేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో లక్ష్మీశంకర్ సంఘటన స్థలానికి చేరుకుని సమస్య రేపటిలోగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.